# పిల్లని కంటాను

'నాకు భయం!'

'భయపడాల్సిందేమీలేదు. డాక్టర్లు సమర్థులు. మన మేలు కోరేవాళ్లు. నిర్భయంగా ఉండు' శ్రీరాం ఆఫీసుకు వెళ్లిపోయాడు.

వైదేహికి మళ్ళీ ఏడుపు. భర్త దగ్గరుంటే కొంత ఓదార్పు, వెళిపోతే దుఃఖం.

'ఏం భయం లేదు!' అత్త ఉత్తమురాలు. సొంత తల్లిలాగా చూచుకొంటూ వచ్చింది. ఇవాళ భయంకరంగా ఉంది. అత్తను గూర్చి అమ్మ అడిగింది.

'వనజ ఎలా ఉంటుంది!'

'అమ్మలాగా'

అటువంటి దేవత ఇవాళ దెయ్యంలాగా కనబడసాగింది.

మునుపు అత్త తల నిమిరితే హాయిగా ఉండేది. ఇవాళ తాకితే పాము కాటేసినట్లుంది.

అత్త అగ్నిగుండం. తాను దగ్ధమవుతుంది.

'నీ మేలు కోరే!' అంది వనజ.

'నాకు భయం!'

'మనందరి కోసం!'

'నాకిష్టంలేదు!'

'నీ ఇష్టానిష్టాలతో మాకు సంబంధం లేదు'

వనజ నలుగురన్నలకు ఒక్కతే చెల్లెలు. ఆమె భర్త అయిదుగురు అక్కలకు ఒక్కడే తమ్ముడు.

అతడి అక్క లందరికీ ఆడపిల్లలే!

తనకు కూడా ముగ్గురాడ పిల్లల తర్వాత ఒక్కగా నొక్క కొడుకు శ్రీరాం.

అతణ్ణి ఇంటిపేరు నిలిపే వంశాంకురంగా ప్రేమగా పెంచారు. తాతముత్తాతల ఆస్తికి ఒక్కడే వారసుడు. వల్లమాలినంత ఆస్తి. సంపాదన.

వైదేహిని వనజ తనకొడుకోసం కోరుకోవటంలో అంతర్యం ఉంది.

ఆమె తల్లిదండ్రులు జానకీ రామయ్యలు. తండ్రి అన్నదమ్ములు ఐదుగురు. వాళ్ళకు పాతికమంది మగ పిల్లలు. అంతమందికి తానొక్కతే సోదరి!

ఈ వంశం-చాలు-బాగుంది. అందరూ మగపిల్లలే పుట్టేచాలు. అంతమందిలో ఒక్కతే ఆడపిల్ల. ఈ వంశంలో ఆడపిల్లలు పుట్టటం అరుదు. వైదేహి ఆడపిల్లల్ని కనదనీ, మగపిల్లల్నే కంటుందని వనజ విశ్వసించింది.

తన భర్త వంశంలో ఎక్కువమంది ఆడపిల్లలు పుట్టటం ఆనవాయితీ.

తనే శ్రీరాంని కని ఘనకార్యం సాధించింది.

శ్రీరాంకి ఎక్కువమంది మగపిల్లలు పుట్టాలంటే, మగపిల్లలే పుట్టే చాలు కోసం వెతికింది వనజ.

వైదేహి నచ్చింది. కట్నం కానుకల గోల లేకుండా పెళ్ళి జరిగింది.

అంతా బాగానే ఉంది. ఆర్నెల్లు గడిచాయి. వైదేహి నెలతప్పింది. మరి మూణ్ణెల్లకి అయిదుగురు అనంతపురం డాక్టర్లు, నలుగురు హైద్రాబాదు డాక్టర్లు, ఒక అమెరికా డాక్టరు వైదేహిని పరీక్షించారు.

పదిమందీ ఒకే మాట చెప్పారు.

'వైదేహి కడుపులో ఆడపిల్ల పెరుగుతూ ఉంది'

వనజ నెత్తిన రాయి పడింది. గుండెలో బండబడింది. గొంతులో వెలక్కాయ ఇరుక్కొంది.

'అందరూ ఆడపిల్లలే పుట్టే వంశంలో ఒకే ఒక్కడు శ్రీరాం వంశోద్ధారకుడు పుట్టాడు. అందరూ మగపిల్లలే పుట్టే వంశంలో వైదేహి ఒక్కతే అదృష్టవంతురాలు పుట్టింది. వాళ్ళకు పెళ్ళయితే అందరూ మగపిల్లతే పుడతారని ఆశపడ్డాను. ఇలా అవుతుందని అనుకోలేదు' వనజ నిట్టూర్చింది. నిరాశ పడింది. నిశ్చయానికి వచ్చింది. నిర్ణయం చెప్పింది.

'కడుపు తీయించాలి'.

ఆరోజు సాయంకాలం జానకీ రామయ్యలు వచ్చారు. కూతుర్ని దీవించారు. ముద్దుమురిపాలు చూపారు.

అమ్మా నాన్నలను చూచి వైదేహి పొంగిపోయింది. కౌగిలించుకొంది. ఏడ్చింది. రక్షిస్తారని వెర్రిదానిలా నవ్వింది. అమ్మ వళ్లో వాలిపోయింది.

'నీ మేలే మాకు ముఖ్యం' అన్నారు వాళ్ళు.

వైదేహి సంతోషించింది.

'నువ్వే మా ప్రాణం!'

వైదేహి నవ్వింది.

మా అత్తమామల ఆశలకు నువ్వే దిక్కు. నువ్వే దైవం. నువ్వే భవితవ్యం. నువ్వే సౌభాగ్యం. సర్వస్వం.'

వాళ్ళ ఓదార్పు ఏమీ మిగల్లేదు.

వెర్రిగా ఏడవసాగింది.

'అమ్మలాంటి అత్త చెప్పినట్లు నడుచుకో' అన్నారు. జానకీ రామయ్యలు వెళిపోయారు.

అన్నలు తమ్ములూ వచ్చారు. ఆదరంగా మాట్లాడారు. ఎంతో సంతోషం.

'మీ అత్తమాటవిను!'

మళ్ళీ భయం.

ఆడబిడ్డలు వచ్చారు. సానుభూతి చూపారు. అదే సలహా. అదే దుఃఖం.

అత్త వస్తుందేమోనని భయం. గుండెలమీద గుర్రాలు పరుగెత్తినట్లు భయం.

ఎవరేం చెప్పినా తాను వినాలి. తనమాట ఎవరూ వినరు.

తాను చదువుకొంది. లెక్చరరుగా చేరింది. పెళ్లయి, ఉద్యోగం వదులుకొంది. తాను ఆలోచించగలదు. తనకు కొన్ని అభిప్రాయాలున్నాయి. కొన్ని ఆశలు. కొన్ని ఊహలు. ఇవేమీ ఎవరికీ అక్కడ లేదు.

వైదేహి గొప్ప మేధావి, గొప్ప సోషియాలజీ లెక్చరరు అని అందరూ పొగుడుతుంటే తానెంతో గర్వపడేది. అంతా ఏమయింది?

ఇప్పుడు ఎబార్షన్!

రేపు? ఆడపిల్లయితే ఎబార్షన్!

ఎన్ని? ఎన్ని ఆడకడుపులైనా గర్భవిచ్ఛిత్తే!

అసలు మగకడుపే రాకపోతే?

ఒట్టి గొడ్డును ఎవరూ మేపరు. అత్త ఊరుకోదు. సవతిని, సవతుల్ని తెస్తుంది. శ్రీరాం తల్లిమాట జవదాటడు.

తనేమవుతుంది?

తన అందం? తన తెలివితేటలు? తన ఆశలు? తన ఆకాంక్షలు? తన ఆలోచనలు!

ఆడపిల్లకు ఇవేవీ ఉండరాదు. వెర్రి గొడ్డులా తలవూపటం తెలియాలి.

రాత్రి శ్రీరాం చాలా కబుర్లు చెప్పాడు. సంతోషపరచటానికి ప్రయత్నించాడు. అనాసక్తంగా వింది. ఇంతా చెప్పేది, అమ్మమాటను అంగీకరించమనటానికే.

తాను ఆడపిల్లను కనరాదు. ఆడపిల్ల కడుపున పడితే, వేరే మార్గంలేదు. కడుపు కోత తప్పదు.

అసలు మగపిల్లలే కలక్కపోతే తాను తల్లికారాదా? ఆడపిల్లని కనకూడదా? పెంచకూడదా?

బొట్టు కాటుక పెట్టటం, గజ్జెలు గాజులు తొడగటం, జడముడి వేయటం, ఊలూ పూలూ చుట్టటం, చిట్టిచేతులు, చిన్ననడకలు, బుజ్జిమాటలు, పాటలు, ఆటలు తనకు అదృష్టంలేదా? తాను అమ్మా అని పిలిపించుకోదా?

పాలివ్వటం, పక్కలో వేసుకోవటం, ముద్దులు పెట్టటం, పెట్టించుకోవటం, చిచ్చుకొట్టటం, నిద్రపుచ్చటం, లేపటం, స్నానంచేయించటం, పౌడరు వేయటం, గౌను తొడగటం, చేయి పట్టి నడిపించటం, నడవటం, నవ్వటం, ఆడటం, పాడటం, పడటం, లేవటం, దూకటం, తిట్టటం, మందలించటం ఇవేవీ తనకుండవా? తల్లికాబోయే తాను ఎందుకు తల్లికాకుండా పోవాలి?

ఆడపిల్లను పుట్టనివ్వరు. పుడితే అత్తకోపం, మామ నిర్లక్ష్యం, భర్త తృణీకారం, తల్లిదండ్రుల అశాంతి, అనాదరం తప్పవా?

గర్భవిచ్ఛిత్తికి తాను అంగీకరించాలా? ఎన్ని కడుపులు తీయించుకొంటుంది? ఎంత అనారోగ్యం మూట గట్టుకొంటుంది? ఎంత చావుకొని తెచ్చుకొంటుంది?

తానెవరి కోసం బతుకుతున్నట్లు?

అమ్మానాన్నలు? అత్తమామలు? బంధువర్గం? భర్త? తనకోసమా? తనబిడ్డకోసమా?

ఆడపిల్ల అంతిమ లక్ష్యం-తనకోసం తాను బతకటమా? తన సంతానంకోసం తాను జీవించటమా? వైదేహి తల గిర్రున తిరిగిపోతూ ఉంది.

తన అస్తిత్వానికి అర్థం పరమార్థం లేదా?

భర్త నిద్రపోయి చాలా సేపయింది. వైదేహి కన్నీరు మున్నీరుగా ఏడుస్తూ ఉంది.

'వైదేహీ! అంతా సవ్యంగా జరుగుతుంది. భయపడకు! పడుకో!'

ఓదార్పా? కలవరింతా?

భర్త కదిలాడు. భర్త నిద్ర చెడకూడదు. లైటు ఆఫ్ చేసింది. చీకటి! ఏవో నీడలు. పరకాయించి చూస్తే - అంతా శూన్యం.

వైదేహి తల నిండా వెలుతురులు. నీడలు. కుక్కల అరుపులు. నక్కల ఊళలు. గుర్రాల స్వారీ. పులుల పంజాలు. సింహాల కోరలు. శవాల గుట్టలు.

ప్రకృతిలో విపరీతంగా మార్పు. ఊహించని మార్పు! ఎక్కడ చూచినా మగవాళ్ళు! పులులు! సింహాలు! తోడేళ్ళు! ఆడవాళ్ళు లేరు!

ఆడపిల్లల పెళ్ళిభారంకాదు, కట్నకానుకలు ఇవ్వనక్కరలేదు.

ఆడపిల్లలు కావాలి! మగపిల్లలే కట్నం కానుకలు ఇచ్చి ఆడపిల్లల్ని కొనుక్కుపోతున్నారు.

భద్రంగా దాచుకొంటున్నారు. ఇళ్ళల్లో! కోటల్లో! భూగర్భాలలో!

ఆడపిల్లలు పొడవుగా, ఎత్తుగా, లావుగా, బలిష్ఠంగా పుష్టిగా ఉండాలి.

బలంగా ఉన్న ఆడవాళ్ళకే గిరాకీ! ఎక్కువ డబ్బు! ఎక్కువ కట్నం! ఎక్కువ రేటు!

ఒక్క యువతి, అయిదుగురు భర్తలు! పదిమంది భర్తలు.

నీడలు. క్రూరమృగాలు. అడవి జంతువులు. పశువులు-స్త్రీల కొరత.

స్త్రీ అయితే చాలు. అమ్మ అక్క అవ్వ వావి వరుసలు లేవు. వయస్సు యోగ్యతలు లేవు. స్త్రీ అయితే చాలు. చిన్నదా? పెద్దదా? ముసలిదా? ముతకదా? ఏం పనిలేదు.

ఆడసంతానం లేదు. స్త్రీలు చస్తున్నారు. వయస్సు ముదరకముందే! చావు రాకముందే! స్త్రీ అయినందుకే! వందలు వేలు మొగుళ్ళు. మొగోళ్ళు!

ఆడవాళ్ళకోసం మగవాళ్ళు కొట్టుకొంటున్నారు, చంపుకొంటున్నారు. చస్తున్నారు. చంపుతున్నారు. విషవలయం!

ఆడవాళ్ళున్న చోటుకు, రాష్ట్రానికి, దేశానికి యాత్రలు. యుద్ధాలు. సంగ్రామాలు. చావులు.

స్త్రీలకోసం మనుషులున్న చోట్ల, మగ వాళ్ళున్న చోట్ల రక్తపాతం. స్వదేశాలలో, విదేశాలలో నాగరికత శూన్యం. సంస్కృతి శూన్యం. కళలు శూన్యం. భూకంపం. ఆకాశ పతనం. సముద్ర మథనం. తుఫానులు! వరదలు. కల్లోలాలు. చావులు.

రాకెట్ల యుద్ధాలు కాదు, విషవాయుప్రయోగాలు కాదు. అంతరిక్ష యుద్ధాలు కాదు. అణుబాంబు ప్రయోగాలు కాదు. బాంబులతో కాదు. తుపాకులతో కాదు, విల్లంబులతో కాదు, కత్తులు, కటార్లు, ఈటెలు, గండ్రగొడ్డళ్ళు, కొడవళ్ళు కాదు. గుండులు, బండలు, రాళ్ళూ రప్పలూకాదు.

చేతులే ఆయుధాలు. ముష్టియుద్ధాలు. హతుడు స్త్రీని వదిలేస్తాడు. బతికి ఉన్నవాడు ఆమెను ఎత్తుకుపోతాడు. వందలమంది వెంటబడతారు. చంపుకొంటారు. చస్తారు. ఆమెను చంపుతారు.

స్త్రీలు లేనప్పుడు పశువులు ప్రత్యామ్నాయం అవుతాయి. లొంగిన పశువు చనిపోతుంది. లొంగని పశువు చంపుతుంది.

మనిషి విజయుడు. పశువులు అంతరించిపోతాయి.

బలవంతులైన మగవాళ్ళు, బలహీనులైన మగవాళ్ళను ఆడవాళ్ళను చేసి వాడుకొంటారు.

పశువులు అంతరించాయి. మనుషులు చనిపోయారు.

భూమి నిర్విరామంగా తిరుగుతూ ఉంది. విశాల శూన్యంగా నిలచింది.

అడవులు దగ్ధమయ్యాయి.

జలం భూప్రళయం సృష్టించింది.

అడవి మండుతూ ఉంది. ఋతుచక్రం గతి తప్పింది.

ప్రాణ చలనంలేని భూమి విశాల స్మశానంగా ఉంది.

కడుపు పండని గొడ్రాలులాగా భూమి గింగిరాలు తిరుగుతూ ఉంది.

బ్రహ్మ బ్రతిమాలి బామాలి తన బాధ్యతను స్త్రీకి అప్పగించాడు, మనిషి పరమేశ్వరుడై లయకారుడయ్యాడు. ఏమి పెంచి పోషించాలో దిక్కుతోచక విష్ణుమూర్తి కనిపించటం మానేశాడు.

మనిషిమీద తీవ్ర ఆగ్రహం కలిగి బ్రహ్మ సృష్టికార్యం ఆపేశాడు.

బ్రహ్మ కన్నీటి చుక్కపడి, ఏఏటి ఒడ్డునో, ఏ బురదలోనో, ఏ ఏకకణజీవో అమీబాగా కదిలాడవచ్చు.

తన కడుపులోని ఏకకణజీవి ద్వికణ జీవిగా మారినట్లు ఉలిక్కిపడి లేచి చుట్టూ చూచింది వైదేహి.

భర్త ఇంకా నిద్రపోతున్నాడు. ఆమె రెండు కళ్ళూ ఇద్దరు సూర్యుళ్ళు లాగా మండిపోతున్నాయి.

వైదేహి పడకగదిలోకి అత్త ప్రవేశించింది. ఆమె అగ్గిలాగా లేదు. పులిలాగా లేదు. మేకలాగా లేదు. శూన్యంగా ఉంది.

శ్రీరాం లేచి సిద్ధమయ్యాడు.

వైదేహి మంచంమీదే ఉంది. లేవలేదు. సిద్ధం కాలేదు.

'లే! సిద్ధమవు! వెళదాం!' అత్త చెప్పింది. వైదేహి కదల్లేదు.

'లే!' రెక్క పట్టుకొంది.

'లేవను. లేపొద్దు!'

'నీకేమయింది?'

'ఏమీ కాలేదు!'

'పిచ్చా?'

'పిచ్చే!'

'ఎవరు నువ్వు?'

'బ్రహ్మను!'

'ఆఁ!'

'బ్రహ్మ కాళ్ళూ గడ్డం పట్టుకొని బ్రతిమాలి తన పని అప్పగిస్తే అంగీకరించిన ఆడమనిషిని!

శ్రీరాం వచ్చాడు.

వైదేహి లేవలేదు.

మామ వచ్చాడు.

ఆమె కదల్లేదు.

ఇంట్లోకి వచ్చిన వాళ్ళందరూ వైదేహి గదిలోకి వచ్చారు.

'టైం అయింది. వెళదాం కదల'మన్నారు.

'నేను బతకాలి. చావను.'

'ఎబార్షన్ చాలా సులువు. నీకేంకాదు. సుఖంగా ఉంటావు'

'ఉండను! కడుపు తీసేస్తే నేను చచ్చిపోతాను'

'చావ్వు!'

'నాకిష్టంలేదు!'

'నీకు తెలియటం లేదు!'

'మీకు తెలియటం లేదు. నా కడుపు తీస్తే మీరంతా చచ్చిపోతారు. ఒక్కరూ మిగలరు. ఏ ఆడమనిషీ ఉండదు. ఆడవాళ్ళంతా అంతరిస్తారు.'

భర్త, మామ, తల్లి, అక్కలు, బంధుమిత్రులు అందరూ వచ్చి 'మేమంతా లేమా? నీకేంభయం లేదు' అన్నారు.

'లేదు. నాకు భయముంది! నాకోసం కాదు భయం. మీకోసం మీపిల్లలకోసం. మీరందరూ చస్తారు. ఒక్కరూ ఉండరు. నా గర్భవిచ్ఛిత్తి అయితే నేనేకాదు, ఈ స్త్రీలే కాదు, ఏ స్త్రీలూ మిగలరు. ఎవరూ బ్రతకరు. అందరూ చస్తారు. ఆడవాళ్ళేకాదు. మగవాళ్ళూ పుట్టరు. పుట్టిన వాళ్ళు బ్రతకరు. తన్నుకొంటారు. చంపుకొంటారు. చస్తారు.'

'నీకు పిచ్చిపట్టింది.'

'నాకు గాదు, మీకు, మీకు పిచ్చిపట్టింది. ఆలోచనలేని పిచ్చివాళ్ళు మీరు. తెలివితేటల్లేని సన్యాసులు మీరు. మూర్ఖులు మీరు.'

భర్త వచ్చి దగ్గరకూర్చున్నాడు.

'సృష్టి అర్థంకాని వ్యర్థులు మీరు. దేవుణ్ణి ధ్వంసంచేసే అభాగ్యులు మీరు. సృష్టిని పరాభవించే నిర్భాగ్యులు మీరు. తల్లిదండ్రులుగా పనికిరాని అయోగ్యులు మీరు. బ్రతకటానికి అనర్హులు మీరు.'

తల్లిదండ్రులు వచ్చి దగ్గరకు చేరారు.

'నేను మిమ్మల్ని బ్రతికే అర్హుల్ని చేస్తాను. మిమ్మల్ని కాపాడతాను. బ్రహ్మను కాపాడతాను. దేవుణ్ణి రక్షిస్తాను. సృష్టిని సంరక్షిస్తాను.'

'ఏమిటి నువ్వనేది?'

'నా గర్భవిచ్ఛిత్తి జరగరాదు. జరగనీను. మీరు నాకడుపు తీయలేరు. తీయనీను'

'అంటే?'

'పిల్లను కంటాను.'